సాక్షి
మహబూబ్‌నగర్

శనివారం । 18 । అక్టోబర్ । 2025



టపాసుల మోతే..

దీపావళి పండగ రాబోతున్న క్రమంలో తాత్కాలిక లైసెన్స్‌దారులు దుకాణాల ఏర్పాటు చేసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు.

-IIలో ▸



'కురుమూర్తి'కి పట్టువస్త్రాలు

కురుమూర్తిస్వామికి అమరచింత పద్మశాలి కులస్తులు ఏటా సమర్పించే పట్టువస్త్రాల తయారీ పనులకు శ్రీకారం చుట్టారు.

-IIలో ▸

గరిష్టం/కనిష్టం
33.2 /20.3

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా, సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది. జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బాణసంచా దుకాణాలకు లైసెన్స్ తప్పనిసరి

మహబూబ్‌నగర్ క్రైం: దీపావళి పండగ సందర్భంగా జిల్లాలో తాత్కాలికంగా ఏర్పాటు చేసుకునే బాణాసంచా దుకాణాల నిర్వాహకులు తప్పకుండా లైసెన్స్‌తో పాటు పోలీసుల అనుమతి తీసుకోవాలని ఎస్పీ డి.జానకి ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతి లేకుండా దుకాణాలు ఏర్పాటు చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల భద్రత దృష్ట్యా ప్రతి ఒక్కరూ నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తున్నాం



స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ సంస్థ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు మహబూబ్‌నగర్ రీజినల్ మేనేజర్ సంతోష్ కుమార్ అన్నారు. దసరా పండుగ సందర్భంగా సూపర్ లగ్జరీ, డీలక్స్ బస్సుల్లో ప్రయాణం చేసిన వారికి లక్కీడిప్ ఏర్పాటు చేశారు. ఇటీవల తీయగా విజేతలుగా నిలిచిన వారికి శుక్రవారం స్థానిక రీజినల్ మేనేజర్ కార్యాలయంలో ఆయన చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రయాణికుల రద్దీ దృష్ట్యా దసరా పండుగ రోజులు, తిరుగు ప్రయాణంలో ప్రత్యేక అదనపు బస్సులు నడపడం జరిగిందన్నారు. ప్రజలు ఆర్టీసీని ఎంతో ఆదరించినట్లు తెలిపారు. అనంతరం లక్కీడిప్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన కె.శివశంకర్‌కు రూ.25 వేలు, ద్వితీయస్థానం కావలి బాలమణి రూ.15 వేలు, తృతీయ స్థానం మోక్షజ్ఞ రూ.10 వేల విలువ గల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు లక్ష్మి ధర్మ, పర్సనల్ ఆఫీసర్‌తో పాటు ఉమ్మడి జిల్లాలోని ఆర్టీసీ డిపో మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలకు 4 పీజీ సీట్లు మంజూరు

పాలమూరు: ప్రభుత్వ మెడికల్ కళాశాలకు నాలుగు పీజీ సీట్లు మంజూరు చేస్తూ ఎన్ఎంసీ ఉత్తర్వులు జారీ చేశారు. పాలమూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల కోసం ఆర్థో విభాగంలో 4 సీట్ల కోసం, ఈఎన్‌టీ విభాగంలో మూడు పీజీ సీట్ల కోసం దరఖాస్తులు చేసుకోగా... పరిశీలించిన ఎన్ఎంసీ అర్థో విభాగంలో రెండు, ఈఎన్‌టీలో రెండు పీజీ సీట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో మెడికల్ కళాశాలలో మొత్తం 32 పీజీ సీట్లు అయ్యాయి.

హంస @ రూ.1,809

దేవరకద్ర: స్థానిక మార్కెట్‌లో శుక్రవారం హంస ధాన్యం క్వింటాల్‌కు గరిష్టంగా రూ.1,809, కనిష్టంగా రూ.1,792గా ధరలు లభించాయి. ఆముదాల ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.5089గా ఒకే ధర నమోదైంది. సీజన్ ప్రారంభం కావడంతో మార్కెట్‌కు 400 బస్తాల హంస ధాన్యం అమ్మకానికి వచ్చింది.

4,225 నీటి వనరులు.. 10.63 కోట్ల చేప పిల్లలు

- ఎట్టకేలకు సబ్సిడీపై చేప విత్తనాల పంపిణీ
- ఉమ్మడి జిల్లాలో రూ.11.80 కోట్ల వ్యయంతో అమలు
- 'పేట'లో ప్రారంభించిన మంత్రులు దామోదర, వాకిటి
- 66,808 మందికి లబ్ధి.. పరోక్షంగా మరో వేలాది మందికి ఉపాధి
- మత్స్యకార సంఘాలు, సభ్యుల్లో హర్షాతిరేకాలు
- నాణ్యమైనవి సరఫరా చేసేలా చూడాలని విజ్ఞప్తి



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు చేప పిల్లల పంపిణీకి శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలో 26,357 చెరువులు, కుంటలు ఇతర జలాశయాల్లో సుమారు రూ.120 కోట్ల వ్యయంతో దాదాపు 85 కోట్ల చేప విత్తనాలు, రొయ్యలు వదిలేలా రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు శుక్రవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి నారాయణపేట జిల్లా వేదికగా లాంఛనంగా ఈ పథకాన్ని ప్రారంభించారు. మక్తల్ నియోజకవర్గ పరిధిలోని సంగంబండ చెరువులో చేప పిల్లలు వదిలారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి పాలమూరులోని ఐదు జిల్లాల్లో బొచ్చ, బంగారు తీగ, రౌట, మోస్ వంటి తదితర రకాల చేప విత్తనాల పంపిణీకి అధికారులు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి..

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి 100 శాతం సబ్సిడీతో ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. ఉమ్మడి పాలమూరులోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నారాయణపేట, జోగుళాంబ గద్వాల, వనపర్తి జిల్లాల్లో ఈ సారి మొత్తంగా రూ.11.80 కోట్ల ఖర్చుతో 4,225 నీటి వనరుల్లో 10.63 కోట్ల చేప పిల్లలను వదలనున్నారు. ఈ మేరకు ఆయా జిల్లాల పరిధిలోని 863 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల్లో సభ్యులు, లైసెన్స్‌దారులు మొత్తం 66,808 మందికి మేలు జరగనుంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా మరో వేలాది మందికి ఉపాధి లభించనుంది. తమ కుటుంబాలకు ఆర్థిక భరోసా కలగనుండడంతో మత్స్యకారుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

వచ్చే నెలాఖరులోగా పూర్తి చేసేలా..

మహబూబ్‌నగర్ జిల్లాలో 35–40 ఎంఎం సైజు చేప పిల్లకు రూ.0.66 పైసలు, పెద్ద సైజు (80–100 ఎంఎం) పిల్లకు రూ.1.54.. నాగర్‌కర్నూల్ జిల్లాలో చిన్న సైజుకు రూ.0.57 పైసలు, పెద్ద సైజుకు రూ.1.56.. జోగుళాంబ గద్వాల జిల్లాలో రూ.0.68 పైసలు, నారాయణపేట జిల్లాలో పెద్ద సైజుకు రూ.1.75 చొప్పున టెండర్లు ఖరారయ్యాయి. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాల్లో నవంబర్ చివరికల్లా చేప పిల్లల పంపిణీ పూర్తి చేసేలా అధికారులు ముందుకు సాగుతున్నారు. గద్వాల జిల్లాల్లో సోమవారం నుంచి పంపిణీ చేసే దిశగా చర్యలు చేపట్టారు. అయితే అదును దాటిన తర్వాత పంపిణీ చేస్తున్న నేపథ్యంలో నాణ్యమైన చేప పిల్లలు పంపిణీ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు విజ్ఞప్తి చేస్తున్నారు. తద్వారా మాత్రమే చేపలు ఎదిగే అవకాశముంటుందని.. అప్పుడే తమకు మేలు జరుగుతుందని చెబుతున్నారు.

జిల్లాల వారీగా చేప పిల్లల పంపిణీ ఇలా..

జిల్లా	నీటి వనరులు	చేప పిల్లలు (కోట్లల్లో)	ఖర్చు (రూ. కోట్లల్లో)
మహబూబ్‌నగర్	1,086	1.94	1.55
నాగర్‌కర్నూల్	1,150	2.58	2.65
వనపర్తి	964	2.28	2.86
జోగుళాంబ గద్వాల	375	1.99	2.75
నారాయణపేట	650	1.83	1.97

నాణ్యత కలిగినవి పంపిణీ చేయాలి



ప్రభుత్వం వందశాతం సబ్సిడీపై మత్స్యకారులకు అందించే చేప విత్తనాలను నాణ్యతతో కలిగినవి పంపిణీ చేయాలి. ప్రతి ఏడాది నాణ్యత లేని చేపపిల్లలను పంపిణీ చేయడంతో సైజు రాక తీవ్రంగా నష్టాలకు గురవుతున్నాం. ప్రభుత్వం ప్రతి ఏడాది మత్స్యకారుల ఆర్థిక బలోపేతం కోసం అమలు చేస్తున్న సబ్సిడీ చేప పిల్లల పంపిణీ కార్యక్రమం ఆశించిన స్థాయిలో మేలు చేకూర్చకపోవడానికి కారణం చేప విత్తనాలు నాణ్యత లేకపోవడమే.

– మోర రవి, హన్వాద

సకాలంలో పంపిణీ చేయాలి



మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల ద్వారా ప్రతి ఏడాది చెరువుల్లో వదిలే చేపపిల్లలను సకాలంలో పంపిణీ చేయాలి. జూన్ నెలలో పంపిణీ చేయాల్సిన చేప పిల్లలను అక్టోబర్, నవంబర్ నెలల్లో వదిలితే వచ్చే వేసవి కాలం వరకు సైజులు రాక ఆర్థికంగా నష్టపోతున్నాం. త్వరగా పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలి.

– కావలి శంకర్, మత్స్యకారుడు, టంకర



సంగంబండ రిజర్వాయర్‌లో చేపపిల్లలను విడుదల చేస్తున్న మంత్రులు దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి, కలెక్టర్ సిక్తాపట్నానాయక్, ఎమ్మెల్యేలు పర్ణికారెడ్డి, వీర్లపల్లి శంకర్, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మత్స్య సంఘాలు, మత్స్యకారుల వివరాలు..

జిల్లా	మత్స్యకార సంఘాలు	సభ్యులు	లైసెన్స్ హోల్డర్లు	మత్స్యకారులు
మహబూబ్‌నగర్	242	12,710	850	12,710
నాగర్‌కర్నూల్	235	18,126	811	18,937
వనపర్తి	146	13,360	600	13,960
జోగుళాంబ గద్వాల	93	7,162	3,000	10,162
నారాయణపేట	147	10,783	256	11,039

(మహబూబ్‌నగర్ జిల్లా కోయిల్‌సాగర్‌లో 850 మంది లైసెన్స్ దారులు ఉన్నారు. వీరికి సంబంధించి కోర్టులో కేసు నడుస్తోంది. ప్రస్తుతం వారికి రెన్యూవల్ కాలేదు.)

వనపర్తి జిల్లాలో మీమాంస..

చేప పిల్లల టెండర్లకు సంబంధించి వనపర్తి జిల్లాలో గందరగోళం నెలకొంది. ఈ ప్రక్రియ పూర్తి కాగా.. చిన్న సైజు చేప పిల్లకు రూ.0.62 పైసలు, పెద్ద సైజుకు రూ.1.66 చొప్పున కోట్ చేసిన ఒకరికి ఖరారైంది. సదరు కాంట్రాక్టర్ వేరే చోట కూడా టెండర్ దక్కించుకున్న క్రమంలో చేప పిల్లలను సక్రమంగా సరఫరా చేస్తాడా.. లేదా అనుమానంతో అధికారులు మీమాంసలో ఉన్నారు. ఒకట్రెండు రోజుల్లో తుది నిర్ణయం తీసుకుని.. నెలరోజుల్లోపు చేప పిల్లల పంపిణీ పూర్తి చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ధాన్యం కొనుగోలులో ఇబ్బంది లేకుండా చర్యలు



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ విజయేందిర

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఈ వానకాలం సీజన్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ రైతులకు ఇబ్బంది లేకుండా సాఫీగా నిర్వహించేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో వానాకాలం 2025–26 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. వ్యవసాయశాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, సహకార శాఖలు చర్చించి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఎక్కువ సంఖ్యలో అవసరాన్ని బట్టి ఏర్పాటు చేయాలని సూచించారు. సన్నధాన్యానికి, దొడ్డు ధాన్యానికి వేరువేరుగా కౌంటర్లను ఏర్పాటు చేయాలని, కొనుగోలు కేంద్రాల్లో తప్పనిసరిగా నాణత్య ప్రమాణాలు కలిగిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని చెప్పారు. ఆరబెట్టి తాలు, మట్టి శుభ్రపరచి నిర్ణీత తేమ శాతం వచ్చిన ధాన్యంను కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చేలా గ్రామాల్లో రైతులకు వ్యవసాయ శాఖ అవగాహన కలిగించాలని సూచించారు. రైస్ మిల్లర్లు ముందుగానే పౌర సరఫరాల సంస్థ డీఎంతో ఒప్పందం చేసుకుని మిల్లింగ్ సామర్థ్యం మేరకు బ్యాంకు గ్యారంటీలు సమర్పించాలన్నారు. మిల్లుల టాగింగ్ ను రైస్ మిల్లర్లతో చర్చించి పక్కాగా చేయాలని, పౌర సరఫరాల అధికారులు పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ముందే కేంద్రాలలో అన్ని మౌలిక వసతులను కల్పించాలన్నారు. ఈ సంవత్సరం జిల్లాలో వానకాలంలో 4,60,000 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి కానుందని వ్యవసాయశాఖ అంచనా వేసిందని, స్థానిక వినియోగం, విత్తన తయారీకి పోనూ 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రేడ్ ఏ ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,389, సాధారణ రకానికి రూ.2369, సన్నధాన్యంకు అదనంగా రూ.500 బోనస్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ బి.రత్నం, జిల్లా పౌరసరఫరాల సంస్థ డీఎం రవినాయక్, జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్ ఏపీడీ శారద, డీసీఓ శంకరాచారి, ఆర్టీఓ రఘు, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేష్, జిల్లా మార్కెటింగ్ అధికారిని బాలమణి పాల్గొన్నారు.

ఇంటి అనుమతి కోసం వంకలు పెట్టొద్దు

- మున్సిపల్ అధికారులపై ఎమ్మెల్యే యెన్నం మండిపాటు



మున్సిపల్ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నగర పరిధిలో కొత్త ఇళ్ల నిర్మాణానికి పర్మిమిషన్ ఇవ్వడంలో ఎలాంటి వంకలు పెట్టొద్దని టౌన్ ప్లానింగ్ అధికారులపై ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మండిపడ్డారు. ఈ విషయంలో తమకు ఎన్నో ఫిర్యాదులు అందుతున్నాయని, వీలైనంత త్వరగా నిబంధనల మేరకు సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఆయా విభాగాల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడా ఆక్రమణలు జరగకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్తి పన్ను బకాయిలపై ఆరా తీశారు. నగరంలోని సుమారు 53 వేల అసెస్‌మెంట్‌దారుల నుంచి బకాయిలు కలుపుకొని మొత్తం రూ.49.95 కోట్లు రావాల్సి ఉండగా ఇప్పటివరకు రూ.12.02 కోట్లే వసూలు కావడమేమిటని ప్రశ్నించారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా మిగిలిన రూ.37.93 కోట్లు రాబట్టాల్సిందే నన్నారు. అలాగే మున్సిపల్ కాంప్లెక్స్‌ల అద్దె రూ.23 కోట్లకు గాను కేవలం రూ.2.22 కోట్లు మాత్రమే వసూలు కావడంపై అసహనం వ్యక్తం చేశారు. ఇక ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు అందేలా చూడాలన్నారు. అలాగే పారిశుద్ధ్యం ఇంకా మెరుగుపడాలని, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అభివృద్ధి పనులు ఆగకుండా కాంట్రాక్టర్లతో మాట్లాడి ఎప్పటికప్పుడు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. వారికి చెల్లించాల్సిన బిల్లుల విషయమై ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళతామన్నారు. సమావేశంలో కార్పొరేషన్ కమిషనర్ టి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్, ఏఎంసీ అజ్మీరా రాజన్న, మేనేజర్ వెంకటేశ్వర రావు, ఇన్‌చార్జ్ ఎంఈ నర్సింహ, డీఈఈలు హేమలత, విజయకుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు బీసీ జేఏసీ బంద్

పాలమూరు: బీసీ రిజర్వేషన్ల సాధన కోసం బీసీ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు బంద్‌ను విజయవంతం చేయడానికి బీసీ జేఏసీతో పాటు ప్రజా సంఘాలు ఎక్కడిక్కడ ప్రత్యేక కార్యక్రమాలకు సిద్ధమవుతున్నాయి. జిల్లాలో ఇప్పటికే ప్రైవేట్ పాఠశాలలు బంద్ నిర్వహిస్తున్నట్లు సెలవు ప్రకటించాయి. అదేవిధంగా ఆర్టీసీ బస్సులు సైతం డిపోలు, బస్టాండ్‌లకు పరిమితం అయ్యే అవకాశం కన్పిస్తోంది. పెట్రోల్ బంకులు, సినిమా థియేటర్లు, దుకాణాలు కూడా మధ్యాహ్నం వరకు మూతపడే అవకాశం ఉంది. బంద్‌కు అన్ని రకాల పార్టీలతో పాటు ప్రజా సంఘాలు, జేఏసీలు మద్దతు తెలిపాయి. ఆయా పార్టీల నేతలు బంద్‌లో ఎక్కడిక్కడే పాల్గొనాలని తమ కార్యకర్తలకు సూచనలు చేశారు.

'సాక్షి'పై కక్ష సాధింపు సరికాదు

- ఎడిటర్‌పై అక్రమ కేసులు ఎత్తివేయాలి



తెలంగాణ చౌరస్తాలో కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న సాక్షి సిబ్బంది, వివిధ జర్నలిస్టు, ప్రజా సంఘాల ప్రతినిధులు



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): నిజాలను నిర్భయంగా రాస్తున్న 'సాక్షి' దినపత్రికపై దాడులు హేయమైన చర్య అని పలువురు అభిప్రాయపడ్డారు. ఎడిటర్ ధనంజయరెడ్డిపై ఏపీలోని కూటమి ప్రభుత్వం చేస్తున్న అక్రమ కేసులు, వేధింపులను ఖండిస్తూ శుక్రవారం కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. పత్రిక స్వేచ్ఛపై దాడులు ఆపాలంటూ నినాదాలు చేస్తూ 'సాక్షి' కార్యాలయం నుంచి కొవ్వొత్తుల ప్రదర్శనగా బయలుదేరి తెలంగాణ చౌరస్తా వరకు సాగింది. ఈ కొవ్వొత్తుల ప్రదర్శనకు వివిధ పార్టీలు, ప్రజా, ఫొటో, జర్నలిస్టు సంఘాలు మద్దతు తెలిపాయి. తెలంగాణ చౌరస్తాలో నినాదాలు చేస్తూ నిరసన ప్రదర్శన చేశారు. ఏపీ ప్రభుత్వం 'సాక్షి' పత్రికపై చేస్తున్న అరాచకాన్ని ఆపాలంటూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సాక్షి బీఎం శ్యాంసుందర్, ఎడిషన్ ఇన్‌చార్జి హరిప్రసాద్, బ్యూరో ఇన్‌చార్జి కిషోర్‌కుమార్, సాక్షి టీవీ కరస్పాండెంట్ విజయ్‌భాస్కర్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి.సురేష్, ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షుడు వెంకటేశ్, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు వెంకటేశ్వర్‌రావు, శివకుమార్, వెంకటయ్య, జనార్దన్, ఫొటోగ్రాఫర్లు భాస్కర చారి, వెంకటేశ్, కిరణ్, రాజు, సాక్షి సిబ్బంది సిద్ధురెడ్డి, రాజేందర్‌గౌడ్, జబ్బార్‌లాల్, ఆర్సీ రవికుమార్, వెంకటయ్య, శ్రీశైలం, ప్రభులింగం, మోహన్‌దాస్, ధర్మ, యాదయ్య, మోహన్, సాబేర్, సుదీప్, వెంకటేశ్వర్‌రావు, వీరేష్, సాయి వెంకట్‌రెడ్డి, వినయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మనుగడ సాధించవు



ప్రభుత్వానికి, ప్రజలకు సమాజానికి వారధిగా నిలుస్తూ అవినీతి, అక్రమాలు, పాలకుల దౌర్జన్యాలపై నిర్భయంగా వార్తలు రాసే పరిస్థితి ఉన్నప్పుడే రాజ్యాంగం కల్పించిన నిజమైన భావ ప్రకటన స్వేచ్ఛ ఉన్నట్లు. కానీ, ఏపీ ప్రభుత్వం సాక్షిపై కక్షపూరితకంగా కుట్రలతో దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు బనాయిస్తూ పత్రిక స్వేచ్ఛకు సంకెళ్లు వేస్తుంది. పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేసిన ఏ ప్రభుత్వం మనుగడ సాధించలేదు.

– పి.సురేష్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి

పత్రికల స్వేచ్ఛను అడ్డుకోవద్దు



ప్రజాస్వామ్యాన్ని కాపాడటంలో పత్రికలు మూల స్తంభం లాంటివి. అలాంటి పత్రికల స్వేచ్ఛను అడ్డుకోవడం ప్రశ్నించే ప్రజల గొంతులను నొక్కడ మే.ఏపీలో 'సాక్షి'ని, అందులో పనిచేసే జర్నలిస్టులను లక్ష్యంగా పెట్టుకుని ఏపీ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు చేపట్టడం తగదు. భౌతిక దాడులు, తప్పుడు కేసులు పెట్టి బెదిరించడం రాజ్యాంగ విరుద్ధం.

– పట్నం చెన్నయ్య, టీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

కక్ష సాధింపు మానుకోవాలి...



సాక్షి ఎడిటర్‌పై పోలీసుల వేధింపులు తగదు. పత్రికల్లో సమాజంలో జరుగుతున్న వివిధ అంశాలను ప్రచురిస్తుంటారు. దానిపై ప్రభుత్వానికి ఏమైనా అభ్యంతరాలు ఉంటే వివరణ ఇవ్వాలి తప్ప కేసులు బనాయించడం పత్రికా స్వేచ్ఛను హరించడమే. ఏపీ సీఎం చంద్రబాబు అనుసరిస్తున్న ధోరణులు హిట్లర్, ముసోలియన్ లాంటి నియంతల పోకడలను తలపిస్తున్నాయి. ఏపీ ప్రభుత్వ వైఖరిని ముక్త కంఠంతో ఖండించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

– ఎస్ఎం ఖలీల్, టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ప్రశ్నించే గొంతు నొక్కే ప్రయత్నం..



విమర్శనాత్మకమైన, స్వతంత్రమైన, పరిశోధనాత్మకమైన పత్రిక స్వతంత్రం ఏ ప్రజాస్వామిక రాజ్యానికైనా జీవనాడి వంటిది. ఏపీలో ప్రశ్నించే గొంతుకల పట్ల, ప్రత్యేకించి సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డిపై పోలీసు కేసులు బనాయించి రాష్ట్ర ప్రభుత్వం కక్ష కట్టి వ్యవహరిస్తుంది. ఇది ఒక్క సాక్షి సమస్య కాదు. పాత్రికేయులు, ప్రజాస్వామికవాదులు మేలుకోకపోతే ఇది అందరి సమస్యగా మారుతుంది.

– వెంకటేశ్, ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షుడు, మహబూబ్‌నగర్

కక్ష కట్టడం సరికాదు..



ప్రజాస్వామ్యానికి మూలస్తంభాల్లో ఒకటైన పత్రికలు ప్రతిపక్ష పాత్ర పోషించడం సర్వసాధారణం. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతున్నారనే కక్షతో సాక్షిపై కక్ష కట్టడం సరికాదు. ఎడిటర్‌ను బాధ్యుడిని చేస్తూ కేసులు బనాయించడం సబబు కాదు. దాడులు, కేసులతో భయపెట్టి తమ దారికి అడ్డు తొలగించుకోవాలనుకోవడం అప్రజాస్వామికం. భావ ప్రకటన స్వేచ్ఛను హరించే విధానాలతో తక్షణమే స్వస్తి పలకాలి.

– వెంకటేశ్వర్‌రావు, సీనియర్ జర్నలిస్టు

ఒక్కరోజులో 1,524 టెండర్లు

- నేటితో ముగియనున్న 'మద్యం' దరఖాస్తుల స్వీకరణ



ప్రత్యేక కౌంటర్‌లో ద్వారా దరఖాస్తులు తీసుకుంటున్న సిబ్బంది

మహబూబ్‌నగర్ క్రైం: ఉమ్మడి జిల్లాలో మద్యం దుకాణాలకు టెండర్లు కొంత స్వల్పంగా పెరిగాయి. మొత్తం 227దుకాణాలకు శుక్రవారం ఒక్కరోజే 1,524 టెండర్లు దాఖలు కావడం విశేషం. ఇక ఇప్పటివరకు 2,735 దరఖాస్తులు రాగా దీని ద్వారా ప్రభుత్వానికి రూ.82.05కోట్ల ఆదాయం వచ్చింది. టెండర్ల స్వీకరణకు శనివారం చివరి రోజు కావడం వల్ల ఏస్థాయిలో పెరగనున్నాయి అనే విషయం తెలియాల్సి ఉంది. అయితే నేడు బీసీ జేఏసీ రాష్ట్ర బంద్‌కు పిలుపు ఇచ్చిన క్రమంలో ఆ ఎఫెక్ట్ టెండర్లపై ఉంటుందా? అనే అనుమానం అధికారులు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తుల లెక్కల ప్రకారం మహబూబ్‌నగర్ జిల్లా మొదటిస్థానంలో ఉండగా చివర్లో వనపర్తి జిల్లా ఉన్నాయి. ఇప్పటివరకు మహబూబ్‌నగర్‌లో 883, నాగర్‌కర్నూల్‌లో 668, గద్వాలలో 467, నారాయణపేటలో 423, వనపర్తిలో 294 టెండర్లు దాఖలయ్యాయి.

■ మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలో ఉన్న 98 మద్యం దుకాణాలకు సంబంధించిన టెండర్ల స్వీకరణ కోసం కలెక్టరేట్‌లో ఉన్న ప్రజావాణి సమావేశ మందిరంలో 12 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ప్రతి సర్కిల్ పరిధిలో మూడు కౌంటర్లు ఏర్పాటు చేసి అక్కడ ప్రత్యేక ఎక్సైజ్ సిబ్బందిని ఏర్పాటు చేసి వచ్చిన దరఖాస్తుదారుల నుంచి టెండర్లు స్వీకరించారు.

క్లుప్తంగా

ఉత్సాహంగా వాలీబాల్ ఎంపికలు



మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో శుక్రవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అండర్-19 విభాగం బాలబాలికల వాలీబాల్ ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ శారదాబాయి మాట్లాడుతూ ఎంపికలకు 60 మంది బాలబాలికలు హాజరైనట్లు తెలిపారు. వీరిలో 12 మంది చొప్పున రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు చెప్పారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో శనివారం నుంచి రాష్ట్రస్థాయి అండర్-19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి బాలికల వాలీబాల్ టోర్నమెంట్ జరుగుతుందన్నారు. టోర్నీలో ప్రతిభ చాటి విజేతగా నిలవాలని ఆకాంక్షించారు. ఉజిల్లా వాలీబాల్ సంఘం ప్రతినిధి చెన్న వీరయ్య, పీడీలు సుచేతన్‌రెడ్డి, రాంచందర్, రమే ష్‌బాబు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి దుర్మరణం



షాలు (ఫైల్)

రాజోళి: ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. మండల కేంద్రమైన రాజోళికి చెందిన పింజరి నడిపి షాలు(48) మండలంలోని ముండ్లదిన్నెకు పనుల నిమిత్తం ట్రాక్టర్‌తో వెళ్లి వస్తున్నాడు. ఈ క్రమంలో అశోక్‌నగర్ క్యాంపు నుంచి రాజోళి వైపునకు వస్తుండగా..అదుపు తప్పిన ట్రాక్టర్ రోడ్డు పక్కనే ఉన్న ఆర్‌డీఎస్ కెనాల్‌లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. దీంతో ఆయన అక్కడిక్కడే మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న రాజోళి పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు.

స్పిన్నింగ్ మిల్లులో కార్మికుడి మృతి

అడ్డాకుల: మండల కేంద్రం శివారులో ఏర్పాటైన ప్రగతి స్పిన్నింగ్ మిల్లులో కార్మికుడు మృతి చెందాడు. పోలీసులు వివరాల ప్రకారం .. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన లాల్‌సింగ్(24) తన తల్లి, సోదరి, బావతో కలిసి స్థానికంగా ఉన్న ప్రగతి స్పిన్నింగ్ మిల్లులో పని చేస్తున్నాడు. కంపెనీలోనే ఉన్న నివాస గృహాల్లో నివసిస్తూ పనికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం మద్యం తాగి విధులకు వెళ్లగా కంపెనీ నిర్వాహకులు పనిలోకి తీసుకోలేదు. తల్లిని పిలిచి గదికి తీసుకెళ్లాలని సూచించారు. తల్లి వెంట గదికి వెళ్లిన కొద్దిసేపటికే బయటికి వచ్చి రెండో అంతస్తు రెయిలింగ్ పైనుంచి కిందపడ్డాడు. స్థానికులు గుర్తించి అంబులెన్స్‌లో జిల్లాకేంద్రానికి తరలిస్తుండగా ప్రాణాలు వదిలినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులు శుక్రవారం ఫిర్యాదు చేయడంతో విచారణ చేసి కేసు నమోదు చేసినట్లు చెప్పారు. మృతదేహానికి శవపరీక్షలు చేయించినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా కంపెనీలో జరిగిన ఘర్షనలో లాల్‌సింగ్ మృతి చెందినట్లు ఆరోపణలు వెలువడుతున్నాయి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



శ్రీనివాసులు (ఫైల్)

కొత్తకోట రూరల్: డీసీఎం వాహన టైర్ పంక్చర్ కావడంతో రిపేరు చేస్తున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని రాయిణిపేట స్టేజి సమీపంలో ఎన్‌హెచ్ 44పై శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఆనంద్ తెలిపిన వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా మర్రిపాడు నుంచి హైదరాబాద్ వెళ్తున్న డీసీఎం వాహనం రాయిణిపేట స్టేజి సమీపం వద్ద టైరు పంక్చర్ కావడంతో టైరు మారస్తున్న క్రమంలో అటుగా వెళ్తున్న గుర్తు తెలియని వాహనం డీసీఎం క్లీనర్‌ను ఢీకొట్టడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు మర్రిపాడు మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన శ్రీనివాసులు(27) గుర్తించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వృద్ధుడి మృతదేహం లభ్యం



కృష్ణయ్య మృతదేహం

బిజినేపల్లి: మండలంలోని వెల్గొండ గ్రామానికి చెందిన కందూర్ కృష్ణయ్య(66) అనే వృద్ధుడు బుధవారం అర్ధరాత్రి తర్వాత చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడగా శుక్రవారం అతడి మృతదేహం లభ్యమైంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. కందూరు కృష్ణయ్య బుధవారం రాత్రి చెరువు సమీపంలో దుస్తులు విప్పి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం అటుగా వెళ్లిన కొందరు దుస్తులను గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా, వారు కృష్ణయ్య కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం కృష్ణయ్య మృతదేహం చెరువులో లభ్యమైంది. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

టపాసుల మోతే..



మహబూబ్‌నగర్‌లోని బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న దుకాణాలు

- తాత్కాలిక బాణసంచా దుకాణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు
- ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే 280 షాపులకు లైసెన్స్‌లు జారీ
- ఒక్క పాలమూరులోనే 68 షెడ్లు ఒకే దగ్గర..
- ఏటా రూ.కోట్లలో అమ్మకాలు
- నిబంధనలు తప్పనిసరి అంటున్న అధికారులు

మహబూబ్‌నగర్ క్రైం: మరో రెండు రోజుల్లో దీపావళి పండగ రాబోతున్న క్రమంలో తాత్కాలిక లైసెన్స్‌దారులు ఉమ్మడి జిల్లాలో దుకాణాల ఏర్పాటు చేసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. ఇప్పటికే వ్యాపారులు అగ్నిమాపక శాఖ కార్యాలయానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సైతం చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో 77 దుకాణాలు ఏర్పాటు చేయనున్నారు. కార్పొరేషన్ పరిధి మొత్తానికి ఇక్కడే అందుబాటులో ఉంచారు. ఇక జడ్చర్లలో ఏర్పాటు చేయనున్న 12 దుకాణాలు రెండు మైదానాల్లో ఉండనున్నాయి. ఇక వనపర్తి, నాగర్‌కర్నూల్, జోగుళాంబ గద్వాల, నారాయణపేట జిల్లాకేంద్రాల్లోనూ తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేయనున్నారు.

ఉమ్మడి జిల్లా పరిధిలో ఇలా..

జిల్లా	ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులు
మహబూబ్‌నగర్	89
నారాయణపేట	33
జోగుళాంబ గద్వాల	28
నాగర్‌కర్నూల్	85
వనపర్తి	45

అగ్నిమాపక శాఖ అధికారులే..

బాణసంచా అమ్మకాలకు తాత్కాలికంగా ఏర్పాటు చేసే దుకాణాల కోసం ప్రభుత్వం కొత్త నిబంధనలను రూపొందించింది. గతంలో కలెక్టరేట్ అధికారులు దుకాణాల ఏర్పాటుకు అనుమతి ఇస్తే.. అగ్నిమాపక శాఖ అధికారులు కేవలం ఎన్‌వోసీ ఇచ్చేవారు. కానీ, ఈసారి కొత్త నిబంధనలు తీసుకువచ్చింది. దీని ప్రకారం దుకాణాలు ఏర్పాటు చేసుకోవడానికి అగ్నిమాపక శాఖ అధికారులే అనుమతితోపాటు ఎన్‌వోసీ ఇవ్వాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసుకున్న తర్వాత క్షేత్రస్థాయిలో ఉండే అగ్నిమాపక శాఖ అధికారులు పరిశీలన చేసి నివేదిక అందిస్తారు. దాని ప్రకారం జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి అనుమతి ఇస్తారు.

పరిశీలన తర్వాతే..

ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన నిబంధనల ప్రకారం బాణసంచా నిర్వాహకులు కచ్చితంగా నిబంధనలు పాటించాలి. లేకపోతే వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు దుకాణాలు సీజ్ చేస్తాం. దరఖాస్తు చేసుకున్న ఫాంలో ఉన్న జాగ్రత్తలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. రేకుల షెడ్ కచ్చితంగా వేసుకోవాలి. షెడ్ నిర్మాణం తర్వాత పరిశీలన చేసి అనుమతి ఇస్తాం. ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా 89 దుకాణాలకు దరఖాస్తులు వచ్చాయి.

– కిషోర్, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి, మహబూబ్‌నగర్

నిబంధనలు ఏం చెబుతున్నాయి

అగ్నిమాపక శాఖ నిబంధనల ప్రకారం జనావాసాల్లో ఎట్టి పరిస్థితుల్లో టపాసుల విక్రయాలు, దుకాణాలు ఉండరాదు. గోదాంలు సైతం ఏర్పాటు చేసేందుకు అనుమతి ఉండదు.

- నివాస సముదాయాలకు కనీసం 50 మీటర్ల దూరంలో దుకాణాలు ఉండాలి.
- తాత్కాలికంగా ఏర్పాటు చేసే దుకాణాలు సైతం మూడు మీటర్ల దూరంలో ఉండాల్సి ఉంటుంది.
- దుకాణాల దగ్గర సిగరెట్, బీడీ తాగరాదు
- ప్రతి దుకాణం వద్ద ప్రత్యేకంగా నీటి సౌకర్యం , అగ్ని నిరోధక పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలి.
- జనావాసాల మధ్య తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసే చోట తప్పనిసరిగా అగ్నిమాపక శాఖ ఎన్‌వోసీ ఉండి తీరాలి. ప్రమాద బోర్డులు ఏర్పాటు చేయడంతోపాటు ధూమపానం నిషేధిత స్థలంగా ప్రకటించాలి.
- అగ్నిప్రమాదం జరిగితే వెంటనే అంటుకునే తడకలు, ప్లాస్టిక్ కవర్లతో దుకాణాలు ఏర్పాటు చేయరాదు. ప్రత్యేకంగా తయారు చేసిన జింక్, జీఐ రేకులతో మాత్రమే వీటిని ఏర్పాటు చేయాలి. ముఖ్యంగా షెడ్‌లలో హౌస్ కీపింగ్, చుట్టుపక్కల ప్రదేశాలు శుభ్రంగా ఉండాలి.
- ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే అక్కడికి అగ్నిమాపక వాహనం వచ్చి చుట్టూ తిరిగే విధంగా స్థలం ఇచ్చి షెడ్‌లను నిర్మాణం చేసుకోవాలి.
- ఒక దుకాణానికి మరో దుకాణానికి కచ్చితంగా 3 మీటర్ల దూరం ఉండాలి. వాటితోపాటు బాణసంచా కొనుగోలు చేయడానికి వచ్చే వారి కోసం ప్రత్యేకంగా దారులు ఏర్పాటు చేయాలి.
- విద్యుత్ వైరింగ్ చేసుకునే సమయంలో ఎలాంటి అతుకులు లేని వైర్ ఉపయోగించాలి. ఒక్కో సందర్భంలో వీటి నుంచి మంటలు వచ్చే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో విద్యుత్ వైరింగ్‌ను జాగ్రత్తగా చూసుకోవాలి.
- రేకులతో కూడిన షెడ్‌లు వేస్తేనే అనుమతి ఇస్తారు.
- ప్రతి దుకాణంలో రెండు మంటలను ఆర్పే పరికరాలు, 200 లీటర్ల రెండు డ్రమ్ములు, 4 నీటి బకెట్‌లు, రెండు ఇసుక బకెట్‌లను అందుబాటులో ఉంచుకోవాలి.
- బాణసంచా దుకాణాల సమీపంలో ఎలాంటి పరిస్థితిలోనూ పొగ తాగరాదని ప్రత్యేకంగా బోర్డులు ఏర్పాటు చేయాలి.
- తాత్కాలికంగా ఏర్పాటు చేసుకునే దుకాణాలకు దూరంగా వాహనాలను పార్కింగ్ చేసేలా చూడాలి.

కురుమూర్తి రాయుడికి పట్టువస్త్రాలు



అమరచింతలో కురుమూర్తిస్వామి పట్టువస్త్రాల తయారీ పనులను ప్రారంభిస్తున్న పద్మశాలి కులస్తులు

- ప్రత్యేక మగ్గంపై నేత పనులు ప్రారంభం
- దేవస్థాన పూజారులతో ప్రత్యేక పూజలు

అమరచింత: కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా అమరచింత పద్మశాలి కులస్తులు ఏటా సమర్పించే స్వామివారి పట్టువస్త్రాల తయారీ పనులకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. పట్టణంలోని భక్త మార్కండేయ స్వామి ఆలయ ఆవరణంలో ప్రత్యేకంగా మగ్గం ఏర్పాటు చేసి పట్టువస్త్రాల తయారీ పనులను చేపట్టారు. కురుమూర్తిస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు ప్రత్యేక పూజలు నిర్వహించి మగ్గంపై నేత పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా పట్టణ పద్మశాలి కులస్తులు మాట్లాడుతూ కలియుగ ప్రత్యక్ష దైవంగా పూజలందుకుంటున్న శ్రీవెంకటేశ్వర స్వామి ప్రతిరూపమే కురుమూర్తి స్వామిగా ఈ ప్రాంతంలో అవతారం ఎత్తి పేదల తిరుపతిగా విరాజిల్లుతూ భక్తుల పాలిట కొంగుబంగారంగా పూజలందుకుంటున్నారని తెలిపారు. స్వామివారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని అనాధిగా వస్తున్న ఆచారం మేరకు తమ కులపెద్దలు సూచించిన విధంగా ఏటా స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించడం జరుగుతుందన్నారు. ఈ ఏడాది సైతం పద్మశాలీ కులస్తులందరూ సామూహికంగా పట్టువస్త్రాలను సమర్పించే పనుల్లో లీనమయ్యారన్నారు. స్వామివారి అలంకరోత్సవం రోజు అమరచింత నుంచి పట్టువస్త్రాలు ఊరేగింపుగా స్వామివారి ఆలయానికి తీసుకెళ్లి సమర్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మహంకాళి సత్యం, వగ్గు రామలింగం, మహంకాళి ఎల్లప్ప, సత్యం, పారుపల్లి శ్రీను, దేవరకొండ లచ్చన్న, చింతన్న, క్యామ శ్రీను, చంద్రమోహన్, కురుమూర్తి, గాజుల వెంకటేష్, మేర్వరాజు, భాస్కర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

నేడు పాలమూరులో కిక్‌బాక్సింగ్ సిటీ లీగ్

హాజరుకానున్న 300 మంది క్రీడాకారిణులు



కిక్‌బాక్సింగ్ లీగ్‌కు ఏర్పాట్లు చేస్తున్న ప్రతినిధులు

మహబూబ్‌నగర్ క్రీడలు: మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో శనివారం అస్మితా ఖేలో ఇండియా కిక్‌బాక్సింగ్ వుమెన్ సిటీ లీగ్ నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు కె.రవికుమార్, ప్రధాన కార్యదర్శి రవినాయక్ శుక్రవారం తెలిపారు. ఇండోర్ స్టేడియంలో లీగ్‌కు సంబంధించి ఏర్పాట్లను వారు పరిశీలించారు. మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదు ప్రాంతాల్లో వుమెన్ సిటీ లీగ్ నిర్వహిస్తున్నట్లు, అందులో ఒకటి మహబూబ్‌నగర్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ లీగ్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా, జగిత్యాల, వరంగల్, రంగారెడ్డి, హైదరాబాద్, సిరిసిల్లతో పాటు వివిధ జిల్లాల క్రీడాకారిణులు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ లీగ్‌లో దాదాపు 300 మంది క్రీడాకారిణులు హాజరవుతారని పేర్కొన్నారు. వివిధ కేటగిరీల్లో పాయింట్ ఫైట్, లైట్, మ్యూజికల్ ఫామ్, టీమ్ వెపన్, టీమ్ కతాస్ విభాగాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. ఉదయం 10 గంటలకు కిక్‌బాక్సింగ్ సిటీ లీగ్ ప్రారంభమవుతుందని తెలిపారు. ముఖ్య అతిథులుగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి మహిపాల్ పాల్గొంటారని వారు తెలిపారు.

ఉద్యోగం రాలేదని.. యువకుడి బలవన్మరణం



నవదీప్ (ఫైల్)

నవాబుపేట: ఎంత ప్రయత్నించినా ఉద్యోగం రావడం లేదని మనస్తాపానికి గురైన ఓ యువకుడు క్షణికావేశంలో బలవన్మరణానికి పాల్పడ్డాడు. మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేటకు చెందిన నవదీప్(20) మూడేళ్ల కిత్రం ఐటీఐ పూర్తి చేసి ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్నాడు. అయితే ఉద్యోగం రాకపోవడంతో మనస్తాపానికి గురైన నవదీప్ శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి పైకప్పునకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు వచ్చి చూసేసరికి మృతిచెంది ఉండటంతో బోరున విలపించారు. ఈ విషయమై నవదీప్ తల్లి మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు.

కాంగ్రెస్ పాలనలో గురుకులాలు నిర్వీర్యం



విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుంటున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

కల్వకుర్తి టౌన్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గురుకులాలను పూర్తిగా నిర్వీర్యం చేసిందని బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ విమర్శించారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలను బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఉప్పల వెంకటేశ్‌తో కలిసి సందర్శించారు. విద్యార్థులు ఆకలితో అలమటిస్తున్నామని నిరసన చేస్తే ప్రభుత్వ అధికారులు వచ్చి పరిశీలించారే తప్ప ఎలాంటి దిద్దుబాటు చర్యలు తీసుకోలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో బడుగు, బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటుగా, మంచి భోజనాన్ని అందించాలన్న ఉద్దేశంతో ఏర్పాటు చేసిన గురుకులాలను కాంగ్రెస్ భ్రష్టుపట్టించదన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా డైలీవేజ్ వర్కర్లను మారుస్తూ కార్మికులకు జీతాలు ఇవ్వకుండా ఉండటంతోనే వారంతా సమ్మెబాట పట్టారని, వారిని పట్టించుకోకపోవటంతో సమస్యలు పెరిగిపోతున్నామన్నారు. కార్మికులు సమ్మెలో ఉండటంతో విద్యార్థులకు పలు సమస్యలు ఎదురవ్వటమే కాకుండా, ఉపాధ్యాయులకు పాఠాలతో పాటుగా ఇతర పనులు చేస్తుండటంతో సమస్యలు తలెత్తుతున్నామన్నారు. సమ్మెలో ఉన్న కార్మికుల డిమాండ్లను పరిష్కరించి, విద్యార్థులకు తగు న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నిరసన చేస్తున్నా.. కనీస పట్టింపులేదు

విద్యావేత్తను అని చెప్పుకునే స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి విద్యార్థులు నిరసన చేస్తున్నా కనీసం అటు వైపు వెళ్లకపోగా, వారి సమస్యలను సైతం తెలుసుకునే ప్రయత్నం చేయలేదని ఆయన విమర్శించారు. ఇంతవరకు ఎమ్మెల్యే ఆశ్రమ పాఠశాలను సందర్శించలేదని, వారి సమస్యలను తెలుసుకోవటంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. అనంతరం కార్మికులు చేపడుతున్న సమ్మెకు సంఘీభావం తెలిపారు. కార్మికులు సైతం మా న్యాయమైన డిమాండ్లు పరిష్కరించి, మాకు న్యాయం జరిగేలా మద్దతుగా ఉండాలని వినతిని అందజేశారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు సూర్యప్రకాశ్, మధు, నరసింహా, జ్యోతయ్య, రాజు, నాయకులు ఉన్నారు.

నిరుపేద విద్యార్థులకు కంప్యూటర్లు

కలెక్టర్‌కు అందజేసిన అరబిందో ఫార్మా ఫౌండేషన్ ప్రతినిధులు



కలెక్టర్‌కు కంప్యూటర్లను అందజేస్తున్న అరబిందో కంపెనీ ప్రతినిధులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాలోని నిరుపేద విద్యార్థుల కోసం అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంప్యూటర్లను పంపిణీ చేయడం అభినందనీయమని కలెక్టర్ విజయేందిర అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో విద్యార్థులకు పంపిణీ నిమిత్తం ల్యాబ్ ట్యాబ్‌లను అరబిందో ఫార్మా లిమిటెడ్ అసోసియేట్ ప్రెసిడెంట్ ఏవీఎస్ మల్లికార్జున్, అరబిందో ఫార్మా లిమిటెడ్ డీజీఎం జనార్దన్‌రెడ్డి కలెక్టర్‌కు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలను డిజిటల్ మౌలిక సదుపాయాలతో బలోపేతం చేయడం జిల్లాలోని నిరుపేద గ్రామీణ విద్యార్థులకు డిజిటల్ విద్యను అందుబాటులోకి తీసుకురావడం లక్ష్యంగా కంప్యూటర్‌లను అందజేయడం పట్ల కలెక్టర్ అరబిందో ఫార్మా ఫౌండేషన్‌ను అభినందించారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని వివిధ గ్రామీణ ప్రభుత్వ పాఠశాలలకు రూ.20 లక్షలతో 50 కంప్యూటర్ డెస్క్‌టాప్‌లను పంపిణీ చేసినట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, పరిశ్రమల శాఖ జీఎం యాదయ్య, అరబిందో ఫార్మా ఫౌండేషన్ అడ్మినిస్ట్రేటర్ పీకేఎస్ గోవర్ధన్ రావు, సీఎంఓ సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

చేపల వలకు చిక్కిన మొసలి



పట్టుబడిన మొసలితో అధికారులు

ఊపిరి పీల్చుకున్న మాందాపూర్ గ్రామస్తులు

పాన్‌గల్: మండలంలోని మాందాపూర్ కేశన్న కుంటలో మత్స్యకారులు చేపల కోసం వేసిన వలలో మొసలి చిక్కుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. కొన్ని రోజులుగా గ్రామ సమీపంలోని కేశన్న కుంటలో రెండు మొసళ్లు సంచరిస్తుండటంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో మొసళ్లు ఉన్న విషయాన్ని సాగర్ స్నేక్ సొసైటీ అధ్యక్షుడు కృష్ణసాగర్‌కు సమాచారం అందించారు. కుంటలో నీళ్లు ఎక్కువగా ఉండటంతో ఆయన రెండు పర్యాయాలు చెరువులో మొసళ్లను బంధించేందుకు ప్రయత్నించి అధికారులు విఫలం చెందారు. ఈ నేపథ్యంలో శుక్రవారం చేపల కోసం వేసిన వలలో మొసలి చిక్కుకుంది. వలలో మొసలి చిక్కిన విషయాన్ని మత్స్యకారుడు చెన్నిరాయుడు, రైతు గొబ్బురిరాజుమాజీ సర్పంచ్ జయరాములుసాగర్‌కు చెప్పగా ఆయన కృష్ణసాగర్‌కు సమాచారం ఇచ్చారు. అనంతరం వలలో చిక్కిన మొసలిని సురక్షితంగా బంధించి ఫారెస్ట్ బీట్ అధికారి గౌతమ్‌కు అప్పగించారు. ఎగువన ఉన్న జూరాల డ్యామ్ నుంచి వచ్చే సాగునీటి కాల్వల ద్వారా కుంటల్లో మొసళ్లు వచ్చి చేరుతున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు.

జూరాలకు నిలకడగా ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో అవుట్ ఫ్లోలు నిలకడగా ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. గురువారం రాత్రి 9 గంటల వరకు ప్రాజెక్టుకు 33వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. శుక్రవారం రాత్రి 8గంటల వరకు ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లోలు 33వేల 500 క్యూసెక్కులకు పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 36వేల 385 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 71 క్యూసెక్కులు, భీమా లిఫ్టు-1కు 650 క్యూసెక్కులు, నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 1,030 క్యూసెక్కులు, కుడి కాల్వకు 700 క్యూసెక్కులు, భీమా లిఫ్టు-2కు 750 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 39వేల 566 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 9.193 టీఎంసీల నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

నిర్విరామంగా విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ కర్ణాటక రాష్ట్రం నుంచి వరద చేరుతుండడంతో దిగువ, ఎగువ జూరాల జల విద్యుదుత్పత్తి కేంద్రాల్లో లక్ష్యానికి మించి విద్యుదుత్పత్తి విజయవంతంగా కొనసాగుతుంది. ఈ మేరకు శుక్రవారం 12 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈ శ్రీధర్, డీఈ పవన్‌కుమార్ తెలిపారు. ఎగువలో 6 యూనిట్ల ద్వారా 234 మెగావాట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు విద్యుదుత్పత్తిని చేపడుతున్నారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటి వరకు 850.460 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేస్తున్నట్లు తెలిపారు. ప్రాజెక్ట్‌కు పూర్తిస్థాయిలో వరద చేరుతున్న సందర్భంగా 36 వేల క్యూసెక్కులను వినియోగించి విద్యుదుత్పత్తిని చేపడుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

శ్రీశైలంలో 882.6 అడుగుల నీటిమట్టం

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో శుక్రవారం 882.6 అడుగుల వద్ద 202.5056 టీఎంసీల నీటినిల్వ ఉంది. జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 36,735, సుంకేసుల నుంచి 4,560 మొత్తం 41,295 క్యూసెక్కు నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయం వస్తున్నాయి. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేశారు. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 6,750, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 2,784, ఎంజీకేఎల్‌ఐకు 1,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 17.003 మిలియన్ యూనిట్లు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో 1.471 మి.యూనిట్ల విద్యుదుత్పత్తి చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

రేవల్లి మండలంలో ఒకేరోజు ముగ్గురు మృతి



గంగనమోని పర్వతాలు(ఫైల్)



సంజీవ (ఫైల్)



శేఖర్ (ఫైల్)

గోపాల్‌పేట: కనిపించకుండా పోయిన వ్యక్తి ఉరేసుకుని మృతిచెందాడు. రేవల్లి ఎస్‌ఐ రజిత కథనం ప్రకారం.. రేవల్లి మండలంలోని చెన్నారం గ్రామానికి చెందిన గంగనమోని పర్వతాలు(38) ఇటీవల మద్యానికి బానిసై అప్పులు చేస్తున్నాడు. గురువారం ఇంటివద్ద కుటుంబ సభ్యులతో గొడవ పెట్టుకుని ఇంటి నుంచి బైక్‌పై ఎక్కడికో వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో గురువారం సాయంత్రం కుటుంబ సభ్యులు రేవల్లి పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేయించారు. శుక్రవారం మండలంలోని తల్పునూరు శివారులో పర్వతాలు చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు, కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పీఎంఈ చేయించి బాడీని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి

మండలంలోని కొంకలపల్లికి చెందిన సంజీవ(54) వరిచేనుకు పెట్టిన విద్యుత్ వైర్లు తగిలి మృతిచెందాడు. రేవల్లి ఎస్‌ఐ రజిత కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సంజీవ గురువారం రేవల్లి టౌన్‌కు వెళ్లాడు. తిరిగి సొంత గ్రామానికి వస్తుండగా దగ్గర దారిలో వెళ్లాలని పొలాల వెంట వెళ్లాడు. పొలాన్ని కాపాడుకునేందుకు పెద్ద ముక్కల బాషా పెట్టిన కరెంటు శాక్ వైర్లకు తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. శుక్రవారం సంజీవ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

రేవల్లి టౌన్‌కు చెందిన దాసరి శేఖర్(33) సుమారు పదిరోజుల క్రితం ఇంటినుంచి బయటికి వెళ్లిపోయాడు. గతంలో కూడా ఇలాగే ఇంటినుంచి వెళ్లి తిరిగి రావడంతో ఇప్పుడు కూడా తిరిగి వస్తాడని కుటుంబ సభ్యులు భావించారు. శుక్రవారం మధ్యాహ్నం రేవల్లి శివారులోని మాదరమోని పుల్లయ్య మక్కచేనులో శేఖర్ మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో కనిపించింది. విషయం తెలుసుకున్న శేఖర్ భార్య మహేశ్వరి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఘనమైన కుటుంబ వ్యాపార నేపథ్యం ఉన్నంత మాత్రాన...
'విజయం అనివార్యం' అని చెప్పడానికి లేదు.
అంకితభావం, కష్టం ఉంటేనే విజయం సొంతం అవుతుంది.
ఘనమైన కుటుంబ వ్యాపారనేపథ్యం లేనంత మాత్రాన...
'విజయం దూరం' అని చెప్పడానికి లేదు.
ఆసక్తికి అంకితభావం, కష్టం తోడైతే విజయం సొంతం అవుతుంది.
దీనికి తాజా ఉదాహరణ... అవెండస్ వెల్త్-హురున్ ఇండియా-2025 జాబితా.
35 ఏళ్ల లోపు ప్రతిభావంతులైన 155 మంది యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్‌లు వెల్త్-హురున్ ఇండియా జాబితాలో చోటు సాధించారు.
వీరిలో...
వారసత్వ బాధ్యతకు తమ శక్తియుక్తులను జోడించి తమదైన గుర్తింపు తెచ్చుకున్నవారు ఉన్నారు. కొన్ని ఉత్పత్తులలో లోపాలు కనిపెట్టి లోపాలు లేని, సౌకర్యవంతమైన ప్రాడక్ట్స్ కోసం ఎంటర్‌ప్రెన్యూర్‌లుగా మారి విజయం సాధించిన వారూ ఉన్నారు... వారిలో కొందరు యంగ్ ఫిమేల్ ఎంటర్‌ప్రెన్యూర్‌ల గురించి..

యువ హవా


అవంతిక సరౌగి

దేశంలో తొలి బయోప్లాస్టిక్ ప్లాంట్

చెరకు, బయోప్లాస్టిక్‌కు సంబంధించిన ఆపరేషన్‌లలో యువ మార్గదర్శకురాలిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది అవంతిక సరౌగి. కాలిఫోర్నియాలో చదువుకున్న అవంతిక తమ బల్‌రామ్‌పూర్ చినీ మిల్స్ లిమిటెడ్ (బీసీఎంఎల్)ను పీఎల్‌ఏ (పాలీలాక్టిక్ యాసిడ్) తయారీ సౌకర్యాన్ని అందించే కంపెనీగా తీర్చిదిద్దే ప్రయత్నాలలో ఉంది. ఇది మన దేశంలోని మొట్ట మొదటి బయోప్లాస్టిక్ ప్లాంట్ కానుంది.

పీఎల్‌ఏ అనేది చెరకు పునరుత్పాదక వనరుల నుండి తయారైన బయో ఆధారిత, కంపోస్టబుల్, తక్కువ ఉద్గారాల ప్లాస్టిక్. దీనిని సాధారణంగా ప్యాకేజింగ్, త్రీడి ప్రింటింగ్‌లో ఉపయోగిస్తారు.

మన దేశంలోని ఈ తొలి బయోప్లాస్టిక్ ప్లాంట్ వల్ల బీసీఎంఎల్ లాభాల బాటలో పయనించనుంది. టర్నోవర్ పెరగనుంది. పర్యావరణ అనుకూలంగా కూడా మారనుంది.

తరగతి గదిని మార్చేలా


పరిత పరేఖ్

వినూత్నమైన ఆలోచన విధానంతో విద్యా, సాంకేతిక రంగంలో మంచి గుర్తింపు తెచ్చుకున్న యంగెస్ట్ ఎంటర్‌ప్రెన్యూర్ పరిత పరేఖ్. బ్రౌన్ యూనివర్శిటీలో చదువుకుంది. బ్రౌన్ తరువాత స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీలో 'ఎర్లీ చైల్డ్‌హుడ్ ఎడ్యుకేషన్'పై మాస్టర్స్ చేసింది. స్టాన్‌ఫోర్డ్‌లో చదువుకునే రోజుల్లో పిల్లల విద్యావిధానం మీద దృష్టి పెట్టేది. స్టాన్‌ఫోర్డ్‌లో చేసిన పరిశోధనలు, నేర్చుకున్న ఆధునిక సాంకేతిక విషయాలు ఆమెను ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ వైపు నడిపించాయి.

కట్టింగ్-ఎడ్జ్ ఎడ్యుకేషనల్ టెక్ ప్లాట్‌ఫామ్ 'టొడెల్'తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా ప్రస్థానాన్ని ప్రారంభించింది పరిత. మూస బోధన పద్ధతులకు అతీతంగా ఆధునిక బోధన పద్ధతులు, ఆలోచనలతో 'టొడెల్' ప్లాట్‌ఫామ్‌కు రూపకల్పన చేసింది. 'టొడెల్' ప్రభావంతో చాలా బడులలో ఉపాధ్యాయుల బోధన పద్ధతి మారింది. ఒక్క ముక్కలో చెప్పాలంటే సంప్రదాయ, ఆధునిక విద్యాబోధనలో ఉన్న అంతరాన్ని తగ్గించడానికి 'టొడెల్' కృషి చేస్తోంది.

విద్యార్థులలో సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచనలను పెంపొందించే ప్రణాళికలతో 'టొడెల్' విద్యాప్రపంచంలో ప్రత్యేక స్థానాన్ని సాధించింది.

సక్సెస్‌ఫుల్ యూఎస్పీతో...


మీనూ మార్గరెట్

ప్రారంభ కష్టాల మాట ఎలా ఉన్నా... ఉమెన్ యాక్టివేర్ 'బ్లిస్‌క్లబ్' మార్కెట్‌లో నిలదొక్కుకోవడానికి ఎంతోకాలం పట్టలేదు. ఈ ఆన్‌లైన్ బ్రాండ్ ఆ తరువాత రెండు ఆఫ్‌లైన్ స్టోర్‌లను కూడా లాంచ్ చేసి విజయం సాధించింది. 'మార్కెట్‌లో ఎన్నో బ్రాండ్‌లు ఉన్నాయి కదా. మీ ప్రత్యేకత ఏమిటి?' అనే ప్రశ్న 'బ్లిస్‌క్లబ్' ఫౌండర్, సీయీవో మినూ మార్గరెట్ ముందు వచ్చి నిల్చుంది. సిగ్నేచర్ ఫ్యాబ్రిక్స్, వినూత్నమైన ప్రాడక్ట్ డిజైన్‌ను తమ కంపెనీ యూఎస్పీగా చేసుకొని విజయం సాధించింది మార్గరెట్.

నేషనల్ లెవెల్ ఫ్రిస్బీ ప్లేయర్ అయిన మినూ మార్గరెట్ యాక్టివేర్‌కు సంబంధించిన డీసెంట్ ఆప్షన్స్ గురించి ఆలోచిస్తున్నప్పుడు 'బ్లిస్‌క్లబ్' స్టార్టప్ ఆలోచనవచ్చింది.

'యాక్టివేర్ రంగంలోని కంపెనీలు డిజైన్ ఫస్ట్ విధానాన్ని అనుసరిస్తాయి. మేము మాత్రం ఈ విధానానికి దూరంగా ఉన్నాం. బ్లిస్‌క్లబ్‌కు డిజైన్ క్లబ్ లేదు. ప్రాడక్ట్ ఇంజినీరింగ్ టీమ్ మాత్రమే ఉంది. ఈ టీమ్ ఏర్పాటు చేయడానికి ప్రధాన కారణం యాక్టివేర్ సౌలభ్యానికి సంబంధించి మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలను కనుక్కోవడం. ఉదాహరణకు చెన్నైలోని ఒక మహిళ గురించి. వేడి వాతావరణంలో ఆమెకు లెగ్గింగ్స్ ధరించడం కష్టమయ్యేది. ఇలాంటి సమస్యను దృష్టిలో పెట్టుకొని వేడివాతావరణంలో కూడా సౌకర్యంగా ఉండే లెగ్గింగ్స్‌ను డిజైన్ చేశాం' అంటుంది మార్గరెట్.

చిన్న గదిలో మొదలై... కోట్ల టర్నోవర్ వరకు


నీతూ యాదవ్ - కీర్తి జాంగ్రా

బెంగళూరులోని చిన్న గదిలో మొదలైన 'యానిమల్' రూ.550 కోట్ల టర్నోవర్ ఉన్న కంపెనీ స్థాయికి చేరింది. ఐఐటీ-ఢిల్లీలో చదువుకున్న కీర్తి జాంగ్రా, నీతూ యాదవ్‌ల బ్రెయిన్ చైల్డ్ 'యానిమల్'. ఈ డిజిటల్ ప్లాట్‌ఫామ్ అవ్యవస్థీకృతంగా ఉన్న మన దేశంలోని పశువుల మార్కెట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టింది.

పశువుల క్రయవిక్రయాలలో 'యానిమల్' యాప్ కీలక పాత్ర పోషిస్తోంది. తమ స్టార్టప్‌ను ప్రారంభించడానికి ముందు సర్వే నిర్వహించి రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు కీర్తి, నీతూ యాదవ్. డైరీ ఇండస్ట్రీలో కీలకమైన మార్పు తేవాలనుకున్న కీర్తి, నీతూ యాదవ్‌లు 'యానిమల్' యాప్‌తో తమ కలను నిజం చేసుకున్నారు. ఈ యాప్ ద్వారా మనం ఉన్న చోటు నుంచే వందల కిలోమీటర్‌ల దూరంలో పశువుల క్రయ విక్రయాలు జరుగుతున్న ప్రదేశం తదితర వివరాలు తెలుసుకోవచ్చు.



దీపావళి వెనుక ఉన్న పురాణాలు

పిల్లలూ... మీకు ఇష్టమైన పండుగలలో దీపావళి ముందు వరుసలో ఉంటుంది కదూ.
దీపాలు వెలిగించడం, టపాసులు పేల్చడం, పిండివంటలను ఆరగించడం... భలే సరదా. అయితే అసలు దీపావళి పండుగ ఎందుకు జరుపుకుంటాం, ఈ వేడుక వెనకున్న కథలేంటి తెలుసుకుందాం.
నేటి 'సాక్షి ఫ్లస్' కిడ్స్ ఈపేపర్‌లో

వంటిల్లు

తియ్యటి వేడుక

ముచ్చటగా అలంకరించిన లోగిళ్లు
అందంగా ముస్తాబైన చిన్నా పెద్దలు
ఓ వైపు దీప కాంతులు
మరోవైపు బాణాసంచా పేలుళ్లు
ఆనందాలు విప్పారుతుండగా
తియ్యని రుచులు నోరారా ఆస్వాదిస్తుంటే
వేడుకంతా నట్టింట్లో కొలువుదీరినట్టే ఉంటుంది.
రెట్టింపు ఆనందాలను పంచడానికి
వంటిల్లు తీపి వంటకాలను
సిద్ధం చేస్తూనే ఉంటుంది.
ఎక్కువ శ్రమ లేకుండా పండగవేళ
తియ్యని రుచులను సులువుగా చేసేద్దాం.
ఇంటిల్లిపాదికి ఆనందాన్ని పంచేద్దాం..



సూజీ హల్వా

కావలసినవి: సూజీ (బొంబాయి రవ్వ) – కప్పు; నీళ్లు – 2 కప్పులు; పంచదార – కప్పు; నెయ్యి – 3 టేబుల్ స్పూన్లు; యాలకుల పొడి – పావు టీ స్పూన్; జీడిపప్పు, కిస్‌మిస్ – అవసరమైనంత.

తయారీ: ● పాన్‌లో నెయ్యి వేడి చేసి, జీడిపప్పు, ద్రాక్ష వేయించాలి. ● వాటిని తీసి, అదే నెయ్యిలో సూజీ వేసి బంగారు రంగు వచ్చే వరకు వేయించాలి. ● మరో పాత్రలో నీరు మరిగించి, రవ్వ పోస్తూ, కలపాలి. ● రవ్వ ఉడికిన తర్వాత పంచదార కలిపి తర్వాత యాలకుల పొడి వేసి కలపాలి. ● చివరగా వేయించిన కాజూ, ద్రాక్ష వేసి మిక్స్ చేయాలి.



గులాబ్ జామూన్

కావలసినవి: రెడీమేడ్ జామూన్ మిక్స్ – కప్పు; నీళ్లు/పాలు – అవసరమైనంత (జామూన్ మిక్స్ కలపడానికి); పంచదార – ఒకటింపావు కప్పులు; నీళ్లు – కప్పు; యాలకుల పొడి – చిటికెడు.

తయారీ: ● పంచదార, నీళ్లు కలిపి, మరిగించి సిరప్ తయారు చేయాలి. దాంట్లో చిటికెడు యాలకుల పొడి కలపాలి ● జామూన్ మిక్స్‌కి కొంచెం నీళ్లు లేదా పాలు జోడించి మృదువుగా కలపాలి ● మిశ్రమాన్ని కొద్ది కొద్దిగా తీసుకుంటూ, ఉండలు చేయాలి ● బాణలిలో నూనె పోసి వేడయ్యాక, సిద్ధంగా ఉంచుకున్న ఉండలు వేసి, వాటిని గోధుమ రంగు వచ్చే వరకు వేయించాలి ● వేయించిన జామూన్లను వేడి సిరప్‌లో వేసి, రెండు గంటలు నాననివ్వాలి.



రైస్ పుడ్డింగ్ / పాయసం

కావలసినవి: బియ్యం – పావు కప్పు; పాలు – 3 కప్పులు; పంచదార – పావు కప్పు; యాలకుల పొడి – పావు టీ స్పూన్; యాలకులు, కిస్‌మిస్ – అవసరమైనంత; నెయ్యి – టేబుల్ స్పూన్.

తయారీ: ● బియ్యం కడిగి, కొద్దిగా ఉడికాక పాలు పోసి, మెల్లిగా మరిగించాలి. ● బియ్యం పూర్తిగా ఉడికాక పంచదార కలపాలి. ● యాలకుల పొడి, వేయించిన జీడిపప్పు, కిస్‌మిస్ వేసి కలపాలి.



బేసిన్ లడ్డూ

కావలసినవి: బేసన్ (సెనగపిండి) – కప్పు; నెయ్యి – పావు కప్పు; పంచదార పొడి – పావు కప్పు; యాలకుల పొడి – పావు టీ స్పూన్.

తయారీ: ● పాన్‌లో నెయ్యి వేసి, వేడి చేయాలి. మంట బాగా తగ్గించి, దాంట్లో శనగపిండి వేసి, మెల్లగా బంగారు రంగు వచ్చే వరకు వేయించాలి. ● చల్లారిన తర్వాత పంచదార పొడి, యాలకుల పొడి వేసి కలపాలి. ● మిశ్రమాన్ని కొద్ది కొద్దిగా తీసుకుంటూ, చేతులతో లడ్డూలు చేయాలి.



వామ్మో.. ఏ(ఐ)డడుగులు..!

మన పురాతన తాటాకు శాసనాల గ్రంథాల్లో అన్నీ ఉన్నాయో లేవోగానీ... మన సినిమాల్లో మాత్రం సకల విజ్ఞాన శాస్త్రాలూ ఉన్నాయి. అందుకు నిదర్శనమే మనదైన పానిండియన్ సూపర్‌హిట్ బ్లాక్‌బస్టర్ సినిమా 'రోబో'!

ఏ అద్భుత ముహూర్తాన మన డైరెక్టర్ శంకర్ 'రోబో' తీశాడోగానీ... లోకమంతటా అవే వింతలు అచ్చం అలాగే జరుగుతున్నాయి. ఉదాహరణకు...

ఇక్కడి మన సినిమాలో హ్యూమనాయిడ్ రోబో కాస్తా మానవ మానస వికాసాలూ, వికారాలూ ఒంటబట్టించుకుని 'రోబో సేపియన్' అవుతాడా! అలా అవ్వగానే ఆ 'టాయ్'ఫ్రెండు కాస్తా హీరోయిన్‌కి 'బాయ్'ఫ్రెండుగా మారి... అచ్చం మన మానవ కుర్రాళ్లలాగే... తనను ప్రేమించని అమ్మాయి మీద యాసిడ్లూ గట్రా విసిరేంత క్రూరమైన 'సెల్ఫ్‌స్టైల్డ్ లవర్‌బా(టా)య్'గా మారిపోతాడు కదా.

అక్కడ అమెరికాలోని ఒహాయో రాష్ట్ర చట్టనిపుణులు బహుశా 'రోబో' సినిమా చూసి హడలిపోయి ఉంటారేమో... మానవ మేధకూ, కృత్రిమ మేధస్సుకూ మధ్య వివాహాలు వద్దంటే వద్దంటూ గొడవ గొడవ చేస్తున్నారు. అంతేనా... ఆ మేరకు ఓ చట్టం తీసుకువచ్చేందుకు బిల్లు కూడా ప్రిపేర్ చేశారు.

అదే డైరెక్టర్ శంకర్‌గారి ఆయొక్క అదే 'రోబో' సినిమాలో... "ఇనుములో ఓ హృదయం మొలిచెలే" పాటనుంచి స్ఫూర్తి పొందినట్టుగా... ఇప్పటికే మన పొరుగు దుండగీడైన చైనావాడు 'దివిరి ఇసుకన తైలంబు' రీతిగా దివిరి ఇనుమున గర్భసంచి నుంచి చిన్నారి పాపలను రేపీపాటికి తీసిస్తానంటూ తొడలుగొడుతూ, హడలగొడుతున్నారన్న సంగతి తెలిసిందే. అంతే కాదు... రోబోలకు సీమంతాలవీ గట్రా చేసేసి కృత్రిమ 'ఊంబ్'ల లోంచి ఉంగా ఉంగా పాపాయిలను పుట్టిస్తానంటూ సవాళ్లు విసురుతున్నారు కూడా.

అమిత వింతలకు నెలవైన అమెరికాలో... ఈ చిత్ర విచిత్రాలన్నీ చూస్తున్న ఒహాయో రాష్ట్రపు మేధావులు భయపడిపోతున్నారేమో... ఆ ఆందోళనతో స్థిమితంగా ఉండలేక... బహ్మాండమైన ఓ వివాహ నిషేధ చట్టాన్ని తెచ్చేందుకు నిశ్చయించుకున్నారు. ఆ మేరకు బిక్కు బిక్కుమంటూ బిల్లొకదాన్ని అక్కడి చట్టసభల్లో ప్రవేశ పెట్టబోతున్నారు కూడా! దీనికి కారణమేంటంటే... అక్కడి కుర్రకారు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పెళ్లిళ్లు చేసుకునేందుకు తెగ ఉత్సాహపడిపోతున్నారట!

హాయ్యో...! ఇప్పటికే అతి మేధావులైన మానవులూ, అమితమైన మేధస్సుల 'కృత్రిమ మేధ' మధ్య పెళ్లిళ్లు జరిగితే... రేపు సదరు 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' కాస్తా పవరాఫ్ ఆటార్నీలంటూ పవర్‌పట్టా తీసుకోవడం, పార్ట్‌నర్‌తో చెట్టాపట్టాలే కాకుండా, లీగల్ వ్యవహారాల్లోకి దూరి, అసలు నిపుణులు తట్టాబుట్టా సర్దుకునేలా, చెట్టూపుట్టా పట్టుకుపోయేలా, బెదిరీ చెదిరీ పోయేలా చేస్తాయేమోనని హడలెత్తుతున్నారు 'ఒహాయో రాష్ట్ర'పు చట్ట నిపుణులు.

అందుకే... మనుషులకూ, యంత్రాలకు మధ్య పెళ్లి మంత్రాలు వద్దంటే వద్దంటూ పట్టుపడుతున్నారు. మానవులూ, యాంత్రాల మధ్య మనువులు వద్దంటూ వాదిస్తున్నారు. ఇది 'యంత్రమాత్రమూ' తగదంటూ బల్లగుద్ది మరీ శాసిస్తున్నారు మన ఒహాయో స్టేట్ రిప్రజెంటేటివ్, రిపబ్లికన్ మెంబరూ అయిన మిస్టర్ 'థాయిడస్ క్లాగెట్' గారు!

అలనాడెప్పుడో బ్రహ్మంగారు చెప్పిన వింతలన్నీ అక్కడా ఇక్కడా జరుగుతూనే ఉన్నాయి. ఇప్పుడీ నేపథ్యంలో ఈ పుట్టు తెలివితేటలున్న మన మానవాళీ... పెట్టు తెలివితేటలున్న రోబోయంత్రాళీ... కలగలసి సంకరమైతే... రేపు భవిష్యత్తులో సకల 'అతి'తెలివితేటలున్న బుజ్జిబుజ్జి రోబో-కంగాళీలకు ఆస్కారముంటుందేమోనని అనుమానిస్తున్నారు.

అచ్చం రోబో సినిమాలోలాగే... రేపెప్పుడైనా పొరబాటున ఆ 'చిట్టి' చిట్టి రోబోలకు విలనీయులైన ఏ అడ్డమైన సైంటిస్టులో 'రెడ్డు చిప్పు' పెడితే... అప్పుడది మన మానవాళి చేతికి 'డేంజరు చిప్పే'ననేమోనంటూ ఇన్నిరకాల ఆంక్షలూ, హాహాకారాలంటూ లోకంలోని ప్రజలంతా తెగ చెవులు కొరుక్కుంటున్నారన్నది అభిజ్ఞ వర్గాల అతి రహస్య భోగట్టా.

– యాసీన్

ఏఐ మ్యారేజ్ ప్రపోజల్



ప్రేమలేఖల నుంచి ఎస్ఎంఎస్‌ల వరకు లవ్, మ్యారేజ్ ప్రపోజల్స్ పలు రకాలు. తాజా విషయానికి వస్తే...ఒక కుర్రాడు ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ను ఉపయోగించి ఫేక్ డిస్నీ-స్టైల్ ట్రైలర్ ద్వారా తన స్నేహితురాలికి మ్యారేజ్ ప్రపోజ్ చేశాడు. ఈ వీడియోకు 11 మిలియన్‌ల వ్యూస్ వచ్చాయి.

ఈ వీడియోను ఎన్నో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో రీషేర్ చేస్తున్నారు.

'ది ఈజీయెస్ట్ యస్. యస్, ప్రపోజ్‌డ్ టు జె... యూజింగ్ ఏఐ' అని వీడియోకు కాప్షన్ ఇచ్చారు.

వీడియో చివరలో 'విల్ యూ మ్యారీ మీ' అనే కామెంట్ కనిపిస్తుంది.

ఇంతకీ ఆ అమ్మాయి 'యస్' చెప్పిందా?

యస్!

'ది మోస్ట్ బ్యూటీఫుల్ మ్యారేజ్ ప్రపోజల్' అంటూ స్పందించారు నెటిజనులు.

ధన త్రయోదశి

ఆరోగ్యమస్తు ధనప్రాప్తిరస్తు



నేడు ధనత్రయోదశి. సాధారణంగా ధన త్రయోదశి అనగానే బంగారం, వెండి, ఇతర గృహోపకరణాలు కొనడం అందరూ చేసేదే. అయితే ధనత్రయోదశి ప్రాశస్త్యాన్ని తెలుసుకోవడం ప్రతి ఒక్కరికీ అవసరం. ఆ కథ తెలుసుకుందాం.

దేవతలు, దానవులు అమృతం కోసం పాలసముద్రాన్ని చిలుకుతున్న సమయంలో ఆ క్షీరసాగరం నుంచి శ్రీ మహాలక్ష్మి జన్మించింది. అంతే కాదు సంపదలను ప్రసాదించే కల్పవృక్షం, కామధేనువు, దేవవైద్యుడు ధన్వంతరి కూడా శ్రీ మహాలక్ష్మితో పాటే జన్మించారు. ఆ రోజు ఆశ్వయుజ బహుళ త్రయోదశి. శ్రీమహాలక్ష్మి ..., ధనానికి ప్రతిరూపం. అందుకే., ఆమె జన్మదినమైన ఈ ఆశ్వయుజ కృష్ణ త్రయోదశిని.. 'ధన త్రయోదశి' అన్నారు.

ఎంత చదువు చదివినా..,, ఎన్ని తెలివితేటలు ఉన్నా., శ్రీ మహాలక్ష్మి అనుగ్రహం లేకపోతే జీవితం గడపడం కష్టం. అందుకే.. సర్వ సంపత్ప్రదాయిని అయిన శ్రీ మహాలక్ష్మి అనుగ్రహం కోసం సర్వ మానవాళి ఈ రోజున శ్రీమహాలక్ష్మిని ఎంతో భక్తి శ్రద్ధలతో పూజించి, ఆమె ఆశీస్సులు అందుకుంటారు.

ధనానికి అధిదేవత 'శ్రీమహాలక్ష్మి. ధనానికి అధినాయకుడు ఉత్తర దిక్పాలకుడైన 'కుబేరుడు'. అందుకే ఈ ధనత్రయోదశి నాడు శ్రీమహాలక్ష్మితోపాటు కుబేరుని కూడా ఆరాధిస్తారు. సాధారణంగా ఈ లక్ష్మీ పూజను సాయం సమయంలో ప్రదోష వేళలో చేసుకుంటే చాలా మంచిది.

లక్ష్మీ కుబేర వ్రతం

ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు, వ్యాపార అభివృద్ధి అదే విధంగా నూతన వ్యాపారం ప్రారంభించబోయే వారు, ఉద్యోగ అభివృద్ధి కోరుకుంటున్నవారు, అప్పుల బాధలు ఉన్నవారు లక్ష్మీ కుబేర వ్రతాన్ని చేసుకోవడం వల్ల ఆయా బాధల నుంచి విముక్తి పొంది, అన్నింటా అభివృద్ధి జరుగుతుందని పెద్దలు చెబుతారు కాబట్టి ఈ వ్రతాన్ని చేయాలనుకుంటున్న వారు అక్షయ తృతీయ రోజు, ధన త్రయోదశి రోజు, కార్తీక శుక్ల పంచమి రోజు లేదా తొమ్మిది గురువారాలు లేక శుక్రవారాలు చేసుకోవచ్చు.

ధన్వంతరి జయంతి

దేవవైద్యుడు, సాక్షాత్తూ శ్రీ మహావిష్ణువు అంశావతారమైన ధన్వంతరి పాలసముద్రం నుంచి ఆవిర్భవించింది కూడా ధనత్రయోదశి నాడే. అందుకే ఈ పర్వదినాన చాలామంది ధన్వంతరిని కూడా పూజిస్తారు. ముఖ్యంగా ఆరోగ్యం బాగలేని వారు, ఆయుర్వేద వైద్య విధానం మీద నమ్మకం ఉన్న వారు శ్రీమహావిష్ణువు ప్రతి రూపమైన ధన్వంతరిని పూజించడం వల్ల ఆరోగ్యవంతులవుతారని చెబుతారు. ధన్వంతరి చేతిలో శంఖు చక్రాలతోపాటు ఔషధ భాండం లేదా అమృత కలశం, జలగ ఉంటాయి. జలగ శరీరంలో చేరిన చెడు రక్తాన్ని పీల్చివేసి ఆరోగ్యాన్నిస్తుందని ప్రతీతి. అందుకే ధన్వంతరి చేతిలో జలూకం అంటే జలగ ఉంటుంది.

నేడు శని త్రయోదశి కూడా. ధనత్రయోదశి నాడే శని త్రయోదశి కూడా రావడం చాలా విశేషం. అందువల్ల ఈ వేళ పాత వస్తువులు, పాత ఆలోచనలు, పాతదనాన్ని వదిలించుకుని, కొత్త వస్తువులు కొనుగోలు చేయటం, కొత్త ఆలోచనలు చేయటం, కొత్త పనులకు శ్రీకారం చుట్టడం చాలా మంచిది.

పితృదేవతాపూజకు కూడా ధనత్రయోదశి చాలా ప్రశస్తమైనది. ధనత్రయోదశి నాడు ఇంటిలో దీపాలు వెలిగించి, మన పెద్దవారిని తలచుకోవడం వల్ల వారి ఆశీర్వాదంతో శుభం చేకూరుతుందని పండితులు చెబుతారు. ఈ శుభవేళ అందరికీ కీడు తొలగి మేలు చేకూరాలని కాంక్షిద్దాం.

– డి.వి.ఆర్.

బులియన్
(బంగారం 10 గ్రా.: వెండి కిలో)
అక్టోబర్ 17న ముగింపు రూ.లలో

నగరం	బంగారం (24 క్యారెట్లు)	బంగారం (22 క్యారెట్లు)	వెండి
హైదరాబాద్	1,34,990	1,24,590	1,90,000
విజయవాడ	1,35,150	1,21,700	1,81,000
విశాఖపట్నం	1,32,770	1,21,700	2,03,000
రాజమండ్రి	1,35,150	1,25,350	1,81,000
ప్రొద్దుటూరు	1,32,500	1,21,900	1,81,000
చెన్నై	1,33,090	1,22,000	2,03,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.